అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 316 | వరంగల్ | బుధవారం, 23 సెప్టెంబర్ 2026 | పేజీలు: 05





గణేశునికి ఘన వీడ్కోలు

ఘనంగా వినాయక నిమజ్జనం

పకడ్బందీగా ఏర్పాట్లు

వివిధ శాఖల సమన్వయంతో ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమం

3

నవరాత్రుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథులకు బుధవారం వరంగల్–హనుమకొండ నగరాల్లో ఘనంగా వీడ్కోలు పలికారు. మధ్యాహ్నం నుంచే వివిధ ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాలు డప్పు చప్పుళ్లు, భక్తుల జైజై నినాదాల మధ్య ఊరేగింపుగా నిమజ్జన కేంద్రాలకు తరలివచ్చాయి. యువత, చిన్నారులు, మహిళలు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో నగరంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు.

- అక్షరశక్తి, ప్రధాన ప్రతినిధి







ఆర్టీజన్ ఉద్యోగులకు సర్వీస్ రూల్స్

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం సానుకూలం

“

రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై యాజమాన్యంతో సానుకూల చర్చలు జరిగాయని పవర్ ఎంప్లాయీస్ జేఏసీ సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో యాజమాన్యంతో జరిగిన చర్చల్లో పలు సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించినట్లు ఆయన వెల్లడించారు.

- అక్షరశక్తి, హైదరాబాద్

4





పట్టణ సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన చర్యలు

ములుగు పట్టణ సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. బుధవారం ములుగు మున్సిపాలిటీ నాలుగో వార్డు లక్ష్మీనగర్‌లో పంచాయతీరాజ్ శాఖ నిధులు రూ.5.95 కోట్లతో నిర్మించిన ఈస్ట్ రోడ్డును జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రారంభించారు. *- అక్షరశక్తి, ములుగు*

2

దోస్త్ స్పాట్ అడ్మిషన్ నోటిఫికేషన్

అక్షరశక్తి, వరంగల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల రంగసాయిపేట వరంగల్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేస్తూ తెలంగాణ ప్రభుత్వం మరియు కమిషనర్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ ఉత్తర్వుల మేరకు కళాశాలలో దోస్త్ స్పాట్ అడ్మిషన్స్ కళాశాలలో మిగిలిన సీట్లకు జరుగుతున్నాయని తెలిపారు. కళాశాలలో బిఎ(HEP, HPCA, EPCA) బి కామ్ బీఎస్సీ లైఫ్ సైన్స్(BZC, BZCS) మరియు బిఎస్సి ఫిజికల్ సైన్స్(MPC, MPCS) కోర్సులు ఉన్నాయని తెలిపారు.ఈ స్పాట్ అడ్మిషన్లు ఈ నెల 24వ తేదీ నుండి 25వ తేదీ వరకు కళాశాల కార్యాలయంలో సంప్రదించి అడ్మిషన్ రిజిస్ట్రేషన్ చేసుకొని సీటు పొందవచ్చునని తెలిపారు ఇది డిగ్రీ ప్రవేశాలకు ఈ విద్యా సంవత్సరానికి చివరి అవకాశంగా భావించి విద్యార్థులు ఉపయోగించుకొని అడ్మిషన్ పొందాలని తెలిపారు.

వయోవృద్ధుల సాధికారిత రాష్ట్ర పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అక్షరశక్తి,వరంగల్: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 1న ప్రదానం చేయనున్న వయోవృద్ధుల సాధికారిత రాష్ట్ర పురస్కారాలు-2026 కోసం అర్హులైన వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన సీనియర్ సిటిజన్లు, వయోవృద్ధుల సంక్షేమం, రక్షణ, ఆరోగ్యం, సామాజిక శ్రేయస్సు, జీవన నాణ్యత మెరుగుదలకు నిరంతరం సేవలందిస్తున్న వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చు. సామాజిక సేవ, విద్య, వైద్యం, కళలు, సాహిత్యం, సంస్కృతి, క్రీడలు, వ్యవసాయం, సాంకేతికత, ప్రజాసేవ, పర్యావరణం తదితర రంగాల్లో సేవలు అందించిన వారికి ఈ అవకాశం ఉంది. వయోవృద్ధుల సంక్షేమం, సంరక్షణ, రక్షణ, సాధికారత కోసం నిరంతర, వినూత్న, ఆదర్శప్రాయమైన సేవలు అందిస్తున్న సంస్థలు,సంఘాలు,స్వచ్ఛంద సంస్థలు, వయోవృద్ధుల సంఘాలు, విద్యాసంస్థలు కూడా సంస్థాగత కేటగిరీలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు ఫారం, మార్గదర్శకాల కోసంwww.wdsc.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారంతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను జతచేసి సెప్టెంబర్ 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు వరంగల్ జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో హార్డ్ కాపీ సమర్పించాలని జిల్లా సంక్షేమ అధికారి కోరారు.

చిన్నవడ్డేపల్లి చెరువులో ఘనంగా వినాయక నిమజ్జనం



అక్షరశక్తి, హనుమకొండ: చిన్నవడ్డేపల్లి చెరువులో వినాయక నిమజ్జనోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమయ్యాయి. కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయి, డాక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత కొబ్బరికాయలు కొట్టి నిమజ్జన వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం క్రేన్ సహాయంతో తెప్పలపైకి వెళ్లి గణనాథుల నిమజ్జన ప్రక్రియను పరిశీలించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 2,500 విగ్రహాలు చిన్నవడ్డేపల్లి చెరువుకు నిమజ్జనానికి రానున్నట్లు గుండు సుధారాణి తెలిపారు. అన్ని నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం, తాగునీరు తదితర సౌకర్యాలపై అధికారులు దృష్టిసారించారు. పోలీస్, రెవెన్యూ, జీడబ్ల్యూఎంసీ, కుడా, విద్యుత్, ఇరిగేషన్, మత్స్య, ఆర్‌అండ్‌బీ, ఫైర్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



పట్టణ సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన చర్యలు





అక్షరశక్తి, ములుగు: ములుగు పట్టణ సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. బుధవారం ములుగు మున్సిపాలిటీ నాలుగో వార్డు లక్ష్మీనగర్‌లో పంచాయతీరాజ్ శాఖ నిధులు రూ.5.95 కోట్లతో నిర్మించిన ఈస్ట్ రోడ్డును జిల్లా కలెక్టర్ బోర్డుడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రారంభించారు. పట్టణ విస్తరణకు అనుగుణంగా రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, మురుగునీటి కాలువలు వంటి మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి ట్యాంకులు, తోపుకుంట మినీ ట్యాంక్‌బండ్, అంతర్గత రహదారులు, స్మశానవాటిక అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

ములుగు జిల్లా సమగ్రాభివృద్ధిలో భాగంగా యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు రూ.15 కోట్లతో అథ్లెటిక్ స్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించినట్లు మంత్రి తెలిపారు. నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రారంభమైందని, జిల్లా ఎస్పీ కార్యాలయ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. రామప్ప, మల్లూరు, మేడారం ప్రాంతాల్లో పర్యాటక సదుపాయాల విస్తరణకు చర్యలు చేపడుతున్నామని, మల్లూరు క్షేత్ర అభివృద్ధికి క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం సమగ్ర అంచనాలు రూపొందించనున్నట్లు చెప్పారు. మేడారంలో 30 పడకల ఆసుపత్రి, ఆర్‌అండ్‌బీ అతిథిగృహం, అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. మారుమూల గ్రామాలకు అనుసంధాన రహదారులు, సీసీ రోడ్లు, తాగునీటి వసతులు, నీటి ట్యాంకుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు సీతక్క పేర్కొన్నారు. రైతుల ధాన్యం నిల్వ సమస్య పరిష్కారానికి ప్రతి మండలంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో గోదాం నిర్మించేందుకు వ్యవసాయ శాఖకు నివేదికలు సమర్పించినట్లు తెలిపారు. మంజూరైన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ బానోత్ రవిచందర్, స్థానిక కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో భారీ వర్షాలు.. 8 జిల్లాలకు రెడ్ అలర్ట్

అక్షరశక్తి, హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో రానున్న 48 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన వాయుగుండం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ బుధవారం రాత్రికి ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరంలో విశాఖపట్నం-గోపాల్‌పూర్ మధ్య తీరం దాటే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. బుధవారం పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆయా జిల్లాల్లో కొన్నిచోట్ల 20 సెంటీమీటర్లకు పైగా అత్యంత భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్ తదితర జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. గురువారం కూడా పలు జిల్లాల్లో రెడ్, ఆరెంజ్ అలర్ట్‌లు కొనసాగనున్నట్లు తెలిపింది. హైదరాబాద్‌తో పాటు పరిసర జిల్లాల్లో సెప్టెంబర్ 26 వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. జీహెచ్‌ఎంసీ, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేసి రోడ్లపై నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు చేయవద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.





సాగునీరు ఇవ్వకుండా రైతులను గోస పెడుతున్నారు

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

అక్షరశక్తి, పాలకుర్తి : సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. దేవరుప్పుల మండలం బంజార గ్రామంలో పలు కార్యక్రమాలకు వెళ్తున్న ఆయన రోడ్డు పక్కన ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలను చూసి వాహనం ఆపి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో ఉపాధిహామీ పనులు చేయాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. సాగునీరు అందక పంటలు సాగు చేయలేకపోతున్నామని, వేసిన పంటలు నీరు లేక ఎండిపోతున్నాయని కూలీలు మాజీ మంత్రికి వివరించారు. చెరువులకు సాగునీరు అందించాలని, వందల ఎకరాలు సాగుకు నోచుకోకుండా రైతులు పొలాలను పక్కన పెట్టాల్సి వస్తోందని ఎర్రబెల్లి అన్నారు. రైతులు పెట్టిన పెట్టుబడులు భారంగా మారుతున్నాయని, రైతుబంధు, యూరియా, విద్యుత్, పంట రుణమాఫీ సమస్యలతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సాగునీరు అందించాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ దేవరుప్పుల మండల నాయకులు పాల్గొన్నారు.

గణేశునికి ఘన వీడ్కోలు

- ఘనంగా వినాయక నిమజ్జనం..
- పకడ్బందీగా ఏర్పాట్లు
- వివిధ శాఖల సమన్వయంతో ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమం



అక్షరశక్తి, ప్రధాన ప్రతినిధి: నవరాత్రుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథులకు బుధవారం వరంగల్-హనుమకొండ నగరాల్లో ఘనంగా వీడ్కోలు పలికారు. మధ్యాహ్నం నుంచే వివిధ ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాలు డప్పు చప్పుళ్లు, భక్తుల జైజై నినాదాల మధ్య ఊరేగింపుగా నిమజ్జన కేంద్రాలకు తరలివచ్చాయి. యువత, చిన్నారులు, మహిళలు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో నగరంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు.

నిమజ్జన కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి బంధం చెరువు, సిద్ధేశ్వర గుండం తదితర ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరంగల్‌లోని చిన్నవడ్డేపల్లి చెరువులో నిమజ్జన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టీ. వెంకన్న, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, ఆర్డీవో సుమ, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నీటిమట్టానికి అనుగుణంగా విగ్రహాల మళ్లింపు

నిమజ్జన కేంద్రాల వద్ద విగ్రహాల సంఖ్య, నీటి లభ్యత, విగ్రహాల ఎత్తును పరిగణనలోకి తీసుకొని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తెలిపారు. నీటిమట్టం దృష్ట్యా బంధం చెరువు, చిన్న వడ్డేపల్లి చెరువు, ఉర్సు చెరువులకు విగ్రహాలను మళ్లించేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. న్యూ శాయంపేటలోని కోట చెరువులోనూ నిమజ్జనానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్, ఫిషరీస్, పోలీస్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేశాయని పేర్కొన్నారు. నిమజ్జన కేంద్రాల వద్ద క్రేన్లు, బ్యారికేడింగ్, విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్య సదుపాయాలు, రాకపోకల ఏర్పాట్లు కల్పించారు.

ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి

నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచడంతో పాటు అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. క్రేన్ల సహాయంతో విగ్రహాలను నిమజ్జనం చేయడాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించారు. హనుమకొండ బంధం చెరువు వద్ద తహసీల్దార్ రవీందర్ రెడ్డి, రెవెన్యూ అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ శాఖ ప్రత్యేక ప్రణాళికతో చర్యలు చేపట్టింది. ఒకేసారి పెద్ద సంఖ్యలో విగ్రహాలు తరలివస్తే రద్దీ, నిరీక్షణ సమయం పెరిగే అవకాశం ఉన్నందున మండపాల నిర్వాహకులు, భక్తులు వీలైనంత త్వరగా నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేసి అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని భక్తులు గణనాథుడిని ప్రార్థించారు.

రాజయ్య జోలికి వస్తే ఊరుకోం

కడియంకు బీఆర్ఎస్ నాయకుల హెచ్చరిక



అక్షరశక్తి, స్టేషన్‌ఘన్‌పూర్: మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా స్పందించారు. బుధవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాజయ్య జోలికి వస్తే తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు. రాజయ్య కుటుంబ నేపథ్యం, రాజకీయ ప్రస్థానం ప్రజలకు తెలుసని, కుటుంబంలో వైద్యులు ఉన్నప్పటికీ సొంత ఆసుపత్రి నిర్మించుకోకుండా ప్రజాసేవకు అంకితమైన నాయకుడని పేర్కొన్నారు. కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఏర్పాటులో రాజయ్య కీలక పాత్ర పోషించారని, ఆ విషయంలో ఉప ముఖ్యమంత్రి పదవిని సైతం కోల్పోయారని గుర్తుచేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఏడు రిజర్వాయర్లను పూర్తి చేసి ప్రారంభించిన ఘనత రాజయ్యదేనని అన్నారు. లింగంపల్లి ప్రాజెక్టు పేరుతో నాలుగు గ్రామాలను ముంపునకు గురిచేసి హనుమకొండలో ఇళ్లు నిర్మించుకున్నారంటూ కడియం శ్రీహరిపై ఆరోపణలు చేశారు. రూ.1,400 కోట్ల అభివృద్ధి పనులు చేశామని చెప్పుకోవడం కాకుండా జీవో 97ను రద్దు చేయాలని సవాల్ విసిరారు. అభివృద్ధిపై ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి బెదిరించడం కడియం శ్రీహరి నైజమని ఆరోపించారు. మున్సిపాలిటీకి వచ్చిన నిధులు, చేపట్టిన పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రిమ్స్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

అక్షరశక్తి, హైదరాబాద్: ఆదిలాబాద్ రిమ్స్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ పరిహారం అందించనున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. ఆదిలాబాద్‌లోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే బాధిత చిన్నారులను హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రులకు తరలించి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. రిమ్స్‌లో 150 పడకల మాతా శిశు ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఎంసీహెచ్‌ను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు.

పర్యాటక ఉత్సవాలకు సిద్ధం

అక్షరశక్తి, హనుమకొండ: ప్రపంచ పర్యాటక దినోత్సవం సెప్టెంబర్ 27 సందర్భంగా జిల్లాలో పర్యాటక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ తెలిపారు. సెప్టెంబర్ 25 శుక్రవారం ఉదయం 6 గంటలకు హన్మకొండ కలెక్టరేట్ (IDOC) లో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 26 శనివారం నాడు టూరిజం యువ క్లబ్ విద్యార్థులకి ప్రత్యేక టూర్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఉదయం పద్మాక్షి టెంపుల్, అగ్గలయ్య గుట్ట వద్ద హెరిటేజ్ వాక్ నిర్వహణ తో పాటుగా ఇతర పర్యాటక స్థలాలు టూర్ ను నిర్వహిస్తున్నారు. ఆదివారం సెప్టెంబర్ 27 సాయంత్రం హన్మకొండ పబ్లిక్ గార్డెన్ లో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. జిల్లా విద్యాశాఖ సహకారంతో ఇప్పటికే విద్యార్థులకు యువ టూరిజం క్లబ్ ల ద్వారా వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తామని శివాజీ తెలిపారు.

109వ ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ వార్షిక సదస్సుకు రిజిస్ట్రేషన్ ప్రారంభం

అక్షరశక్తి,కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయంలో డిసెంబర్ 27 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్న 109వ ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ (IEA) వార్షిక సదస్సుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు స్థానిక నిర్వహణ కార్యదర్శి, కాకతీయ విశ్వవిద్యాలయం సోషల్ సైన్సెస్ అండ్ ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్, ఆర్థికశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బి. సురేష్ లాల్ తెలిపారు. సదస్సులో పాల్గొనదలచిన IEA సభ్యులు, పరిశోధకులు IEA వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. IEA సభ్యులకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.4,000, సభ్యులు కానివారికి రూ.6,000గా నిర్ణయించినట్లు తెలిపారు. పరిశోధనా పత్రాల సమర్పణకు అక్టోబర్ 5, 2026 చివరి తేదీ కాగా, ఎంపికైన పత్రాల ఆమోద సమాచారాన్ని అక్టోబర్ 15న వెల్లడించనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్‌కు అక్టోబర్ 25 చివరి తేదీగా నిర్ణయించినట్లు వివరించారు. సదస్సు డిసెంబర్ 27 నుంచి 29 వరకు కాకతీయ విశ్వవిద్యాలయంలో జరుగుతుందని తెలిపారు. NEFT ద్వారా రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించేవారు IEA CONFERENCE ACCOUNT పేరుతో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతా నంబర్ 45274150460, IFSC కోడ్ SBIN0020262, కాకతీయ యూనివర్సిటీ బ్రాంచ్ ఖాతాకు ఫీజు చెల్లించవచ్చని ప్రొఫెసర్ సురేష్ లాల్ తెలిపారు. పరిశోధకులు తమ పరిశోధనా పత్రాలను నిర్ణీత గడువులోగా సమర్పించి, సదస్సులో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాల కోసం IEA వెబ్‌సైట్‌ను సందర్శించాలని లేదా సదస్సు నిర్వాహకులను సంప్రదించాలని సూచించారు.

ప్రజా చైతన్య కార్యక్రమాల్లో బహుజన సమాఖ్యకు భాగస్వామ్యం

అక్షరశక్తి, వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబర్ 23: ప్రజా చైతన్య కార్యక్రమాల్లో బహుజన కల్చరల్ ఫెడరేషన్ (బీసీఎఫ్) వంటి సామాజిక సంస్థలను భాగస్వామ్యం చేసే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ తెలిపారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ బీసీఎఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రతినిధులు డాక్టర్ రామకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, సానుకూలంగా స్పందించిన రామకృష్ణ ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు సంబంధిత మంత్రులు, అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరగా సమస్యలకు పరిష్కారం లభించేలా ప్రయత్నిస్తానని తెలిపారు. బహుజనులు, వెనుకబడిన వర్గాలు, అర్హులైన ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, హక్కులు సమర్థవంతంగా అందేలా సంబంధిత వర్గాలతో సమన్వయం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీఎఫ్ ప్రతినిధులు అశోక్, శరత్, నర్సింగం, కందిక సుధాకర్, కోటేశ్వర్ తదితరులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.





శాంతి హైట్స్‌లో ఘనంగా గణపతి నిమజ్జనం

అక్షరశక్తి, హనుమకొండ: హంటర్ రోడ్డులోని శాంతి హైట్స్ అపార్ట్‌మెంట్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మారెడ్డి కార్యక్రమంలో పాల్గొని అపార్ట్‌మెంట్ వాసులతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. ప్రతి సంవత్సరం అపార్ట్‌మెంట్ వాసులు కలిసికట్టుగా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళల కోలాటాలు, చిన్నారుల కేరింతలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య గణనాథుడి శోభాయాత్ర కొనసాగింది. అపార్ట్‌మెంట్ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ప్రణాళిక.. పునశ్చరణ ముఖ్యం



అక్షరశక్తి, కేయూ క్యాంపస్ : పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే పక్కా ప్రణాళికతో పాటు నిరంతర పునశ్చరణ అవసరమని ప్రముఖ ఉపన్యాసకులు చెరకు సాయన్న అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీస్ సెంటర్ ఆధ్వర్యంలో 'పోటీ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయన్న మాట్లాడుతూ ముందుగా పరీక్ష సిలబస్‌పై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, ప్రతి సబ్జెక్టుకు నిర్దిష్ట సమయం కేటాయిస్తూ టైమ్ మేనేజ్‌మెంట్ పాటించాలని సూచించారు. చదివిన అంశాలను క్రమం తప్పకుండా పునశ్చరణ చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. గ్రూప్ 1, గ్రూప్ 2తో పాటు ఎస్ఎస్సీ, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ తదితర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లను కూడా విద్యార్థులు గమనించాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీస్ సెంటర్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పుల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ సెంటర్ అందించే మార్గదర్శకాలు, వనరులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సెంటర్ ప్రతినిధులు, పరిశోధక విద్యార్థులు, పెద్ద సంఖ్యలో యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

26న కేయూలో మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్



అక్షరశక్తి, కేయూ క్యాంపస్ : కాకతీయ విశ్వవిద్యాలయం ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఈ నెల 26న హ్యూమానిటీస్ బిల్డింగ్‌లోని సెమినార్ హాల్‌లో మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ప్రభుత్వ పాలన, మానవ వనరుల విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావు ఆవిష్కరించారు. కార్యక్రమానికి కేయూ ఉపకులపతి ప్రొఫెసర్ కర్నాటి ప్రతాపరెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. విద్యార్థులు తమ విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను పొందేందుకు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని పెదమళ్ల శ్రీనివాసరావు సూచించారు. ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డా. చిర్ర రాజు మాట్లాడుతూ హర్షిత్ గ్రూప్, మెహత ఇండస్ట్రీస్, అవొగ్య సొల్యూషన్స్ తదితర సంస్థలు డ్రైవ్‌లో పాల్గొంటాయని తెలిపారు. డిగ్రీ, ఇంజినీరింగ్, ఎంబీఏ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డా. సంకినేని వెంకటయ్య, డా. మామిడి లింగయ్య, డా. చీకటి శ్రీను, డా. బుర్రి ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీజన్ ఉద్యోగులకు సర్వీస్ రూల్స్

- **విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం సానుకూలం**



అక్షరశక్తి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై యాజమాన్యంతో సానుకూల చర్చలు జరిగాయని పవర్ ఎంప్లాయీస్ జేఏసీ సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో యాజమాన్యంతో జరిగిన చర్చల్లో పలు సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించినట్లు ఆయన వెల్లడించారు. ఆర్టిజన్లకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా అన్ని హక్కులు కల్పించేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. పీఆర్‌సీ కమిటీని త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. రిటైర్డ్ ఈపీఎఫ్ ఉద్యోగులకు వైద్య సౌకర్యం కల్పించేందుకు కూడా యాజమాన్యం అంగీకరించిందన్నారు. ఆర్టిజన్లకు సంబంధించిన ఏపీఎస్ఈబీ సర్వీసు నిబంధనల అంశంపై హెచ్ఆర్‌డీ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని, త్వరలోనే వారికి నిబంధనలు అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని యాజమాన్యం తెలిపిందన్నారు. ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కు సంబంధించిన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందని శ్రీధర్ తెలిపారు. అన్‌మ్యాన్డ్ కార్మికుల సమస్యలను క్యాబినెట్ కమిటీలో చర్చించి పరిష్కరించేందుకు సుముఖత వ్యక్తం చేసిందన్నారు. రెగ్యులర్ ఉద్యోగుల ప్రమోషన్ల ప్రక్రియను నెల రోజుల్లోపు పూర్తి చేస్తామని, ట్రాన్స్‌ఫర్ మార్గదర్శకాలను 15 రోజుల్లోపు పూర్తి చేస్తామని యాజమాన్యం అంగీకరించిందన్నారు. కింది స్థాయి ఉద్యోగుల ఖాళీలను కూడా త్వరలోనే భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. ఉద్యోగులు, కార్మికులు, ఆర్టిజన్లు, పెన్షనర్ల సమస్యలపై సానుకూలంగా స్పందించిన యాజమాన్యానికి ఇనుగాల శ్రీధర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మామునూరులో 700 మంది ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ







అక్షరశక్తి, వరంగల్: మామునూరులోని పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో ఈ నెల 20 నుంచి 29 వరకు ఎన్‌సీసీ కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపు కొనసాగుతోంది. వరంగల్ గ్రూప్‌లోని అన్ని బెటాలియన్ల నుంచి వచ్చిన సుమారు 700 మంది ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ ఇస్తున్నారు. ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్, రిపబ్లిక్ డే క్యాంపు, యువ ఆపద మిత్ర స్కీం, వాయుసైనిక్ క్యాంపు, డ్రోన్ క్లాసులకు సంబంధించి శిక్షణ కొనసాగుతోంది. క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలతో పాటు డ్రిల్, ఫైరింగ్, మ్యాప్ రీడింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు క్యాంప్ కమాండెంట్ కల్నల్ సంతోష్ మెహెర్ తెలిపారు. యువతను బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అసిస్టెంట్ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ విజయకుమార్ టి., క్యాంప్ సీనియర్ జేసీఓ సంజయ్ రానా, క్యాంప్ అడ్జుటెంట్ లెఫ్టినెంట్ బి.సవిత, క్యాంప్ క్వార్టర్ మాస్టర్ సుమలత, జీసీఐలు కేఎస్ సుజితదేవి, గాయత్రి, బీహెచ్ఎం అమోల్ గవాయి, ట్రైనింగ్ జేసీఓ సుబేదార్ రమేష్, ట్రైనింగ్ ఎన్‌సీఓ హవల్దార్ దినేష్, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు, కేర్‌టేకర్లు, పీఐ స్టాఫ్, సివిలియన్ స్టాఫ్ శిక్షణ అందిస్తున్నారు.

రాజ్యాంగాన్ని మనువాదుల చెర నుంచి కాపాడుకుందాం



అక్షరశక్తి, ఆత్మకూరు: భారత రాజ్యాంగాన్ని మనువాదుల చెర నుంచి పరిరక్షించుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ పిలుపునిచ్చారు. అంబేడ్కర్‌ను అవమానిస్తే దళితుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. బుధవారం ఆత్మకూరు మండలం నాగయ్యపల్లి గ్రామంలో డీబీఎఫ్ గ్రామ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని ప్రపంచ దేశాలు కొనియాడుతున్నాయని, అలాంటి మహనీయుడిని కించపరిచేలా కొందరు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. అంబేడ్కర్‌ను అవమానించడం, రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడం వంటి చర్యలను సహించేది లేదన్నారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేస్తున్న మతతత్వ శక్తులను ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి మాదాసి సుదర్శన్, ఉపాధ్యక్షుడు చుంచు నరేష్, గ్రామ అధ్యక్షుడు మాదాసి నవీన్, రాజు, సుశీల, రాధ, లక్ష్మి, కొమురయ్య, రాజయ్య, శ్రీకాంత్, కుమారస్వామి, స్వామి, చేరాలు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీల ఆత్మగౌరవం – బీసీల ఐక్యతకు దిక్సూచి

- వరంగల్ పర్యటనలో రాపోలు ఆనంద భాస్కర్

అక్షరశక్తి, వరంగల్: తెలంగాణ సామాజిక, రాజకీయ రంగాల్లో వెనుకబడిన తరగతుల (బీసీ) హక్కుల సాధనతో పాటు చేనేత కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న మాజీ రాజ్యసభ సభ్యుడు రాపోలు ఆనంద భాస్కర్ వరంగల్‌లో పర్యటించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కొడకండ్లకు చెందిన ఆయన తన సొంత ప్రాంతంలో పద్మశాలి సామాజిక వర్గాన్ని ఐక్యంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరాన్ని వివరించారు. రాజకీయ భాగస్వామ్యం, చట్టసభల్లో జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం, సామాజికంగా సముచిత ప్రాధాన్యం సాధించేందుకు కుల ఐక్యత అవసరమని పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించే కృషిలో కీలక పాత్ర పోషించిన రాపోలు ఆనంద భాస్కర్, చేనేత వృత్తిపై ఆధారపడిన పద్మశాలీల ఆర్థిక ప్రయోజనాలను కాపాడేందుకు సమిష్టి పోరాటం అవసరమని అన్నారు. పద్మశాలీలతో పాటు అన్ని బీసీ కులాలు తమ మధ్య ఉన్న విభేదాలను పక్కనపెట్టి హక్కుల సాధన కోసం ఉమ్మడి వేదికపైకి రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు బీసీ వర్గాలు పారిశ్రామికంగా, సాంకేతికంగా అభివృద్ధి చెందేందుకు పరస్పరం సహకరించుకోవాలని సూచించారు. బలహీన వర్గాల పిల్లలకు ఉన్నత విద్య అందించడం ద్వారా మాత్రమే సామాజికంగా శాశ్వత మార్పు సాధ్యమవుతుందని రాపోలు ఆనంద భాస్కర్ పేర్కొన్నారు. విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధి, రాజకీయ భాగస్వామ్యంతో బీసీ వర్గాలు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పద్మశాలీల ఆత్మగౌరవాన్ని బీసీ కులాల సమిష్టి హక్కుల సాధనతో అనుసంధానం చేస్తూ ఆయన చేసిన పర్యటనలో ప్రధానంగా బీసీలంతా ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరాన్ని వివరించారు.







ఉద్యోగ సంఘాలతో చర్చలు సఫలం..

రెండు డీఏలకు తెలంగాణ సర్కార్ ఓకే

అక్షరశక్తి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వంతో ఉద్యోగ సంఘాలు జరిపిన చర్చలు ముగిశాయి. రెండు డీఏలు ఇచ్చేందుకు సర్కార్ అంగీకరించింది. అలాగే నాలుగు నెలల తర్వాత మరో డీఏ ఇచ్చేందుకు ఓకే చెప్పింది. అంతేకాకుండా, ఈ నెలలోనే పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చింది. పీఆర్సీ కమిషన్ గడువును పొడిగించకుండా నివేదిక అందేలా చూడాలని ప్రభుత్వానికి ఉద్యోగ సంఘాలు విజ్ఞప్తి చేశాయి. గడువులోపే పీఆర్సీ ప్రకటించాలని కోరాయి. డీఏ, పీఆర్సీ విషయంలో ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీఎస్ సంజయ్ జాజు, ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు పాల్గొన్నారు. సమావేశం అనంతరం సచివాలయం మీడియా పాయింట్ వద్ద తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ... సీఎస్ ఆధ్వర్యంలో జాయింట్ స్టాఫ్ కమిటీ మీటింగ్ జరిగిందని తెలిపారు. ఉద్యోగుల నుంచి వస్తున్న ప్రధాన డిమాండ్లతో ఈనెల 6న ఉద్యోగ సంకల్ప సభ నిర్వహించామని తెలిపారు. మొత్తం 68 డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఇందుకు ప్రభుత్వం సానుకులంగా స్పందించిందని.. అన్ని సమస్యల పరిష్కారానికి మార్గం చూపించినట్లు తెలిపారు. తమ డిమాండ్ల విషయంలో చొరవ తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎస్ సంజయ్ జాజుకు ధన్యవాదాలు తెలియజేశారు. మొదటి డీఏ 3.64, రెండో డీఏ 2.74 కు ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు. కమిటీ నివేదిక రాగానే పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారని లచ్చిరెడ్డి పేర్కొన్నారు.

రాష్ట్రాలకు ఇంఛార్జిలను నియమించిన బీజేపీ

తెలంగాణ ఇన్‌చార్జిగా సునీల్ బన్సల్

అక్షరశక్తి, డెస్క్ : వివిధ రాష్ట్రాలకు బీజేపీ ఇంఛార్జిలను, కో ఇంఛార్జిలను నియమించింది. పార్టీ వ్యవస్థాగత నిర్మాణం, మార్పులలో భాగంగా 28 రాష్ట్రాలకు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు ఇంఛార్జిలను, కో ఇంఛార్జిలను నియమిస్తూ బీజేపీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబిన్ ఆదేశాలు జారీ చేశారు. బాధ్యతలు అందుకున్న వారిలో పలువురు సీనియర్ లీడర్లు, కేంద్ర మంత్రులు కూడా ఉన్నారు. తెలంగాణకు సునీల్ బన్సల్‌ను ఇంఛార్జిగా, అభయ్ పాటిల్, రేఖా శర్మను కో ఇంఛార్జిలుగా నియమించారు. ఏపీకి అరవింద్ బడోరియాను ఇంఛార్జిగా, వనతి శ్రీనివాసన్‌ను కో ఇంఛార్జిగా నియమించింది. పదవులు అందుకున్న వారిలో కొందరు కొత్తవారు కూడా ఉన్నారు. ఏపీకి చెందిన దగ్గుబాటి పురందేశ్వరిని ఒడిశా ఇంఛార్జిగా నియమించారు. వసుంధరా రాజే, బైజయంత్ జయ్ పాండా, రేఖా వర్మ, తారిక్ మన్సూర్‌లు బీజేపీ ఉపాధ్యక్షులుగా కొనసాగుతారు. మరికొందరిని ఉపాధ్యక్ష స్థానాల నుంచి తప్పించారు.



వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించిన ఇంఛార్జిల వివరాలివి. అండమాన్ నికోబార్ (డ్రై ప్రకాష్), అరుణాచల్ ప్రదేశ్ (దేవేష్ కుమార్), ఆంధ్ర ప్రదేశ్ (అరవింద్ బడోరియా), అసోం (మంగళ్ పాండే), బిహార్ (హరీష్ ద్వివేది), చండీగఢ్ (మహేంద్ర పాండే), దాద్రా నగర్ హవేలి, డామన్, డయ్యూ (పర్షబెన్ నరేంద్ర బాయ్ దోషి), ఢిల్లీ (వినయ్ సహస్రబుద్ధె), గోవా (డా.భారతిప్రవీణ్ పవార్), గుజరాత్ (తరుణ్ చుగ్), హరియాణా (స్మృతి ఇరానీ), హిమాచల్ ప్రదేశ్ (శ్రీకాంత్ శర్మ), జమ్మూ కాశ్మీర్ (డా.సతీష్ పూనియా), ఝార్ఖండ్ (గజేంద్ర పటెల్), కర్ణాటక (హరీష్ ద్వివేది), కేరళం (ఎం నాగార్జున), లదాక్ (రాజ్‌కుమార్ భాటియా), లక్షద్వీప్ (జార్జ్ కురియన్), మధ్యప్రదేశ్ (బిష్ణప్ కుమార్ దేవ్), మహారాష్ట్ర (బలిజయంత్ పాండా), మణిపూర్ (డా. రాజ్‌దీప్ రాయ్), మేఘాలయ (కనద్ పుర్కయస్త), మిజోరం (డా.భగవత్ కరాద్), నాగాలాండ్ (అనిల్ కే ఆంటోని), ఒడిశా (దగ్గుబాటి పురందేశ్వరి), పుదుచ్చేరి (కే సురేంద్రన్), పంజాబ్ (డా.సతీష్ పూనియా), రాజస్తాన్ (సంజయ్ భాటియా), సిక్కిం (రాజు బిస్తా), తమిళనాడు (రామ్ మాధవ్), త్రిపుర (మృగాంక దేవ్ వర్మన్), యూపీ (వినోద్ తావ్డే), ఉత్తరాఖండ్ (రామ్ మాధవ్), వెస్ట్ బెంగాల్ (సునీల్ బన్సల్).



సీటుబెల్టు పెట్టుకున్న గణనాథుడు



అక్షరశక్తి, పరకాల: పరకాల పట్టణానికి చెందిన బండారి గిరిప్రసాద్-అనుష దంపతులు గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తమ నివాసంలో గణనాథుడిని ప్రతిష్ఠించారు. బుధవారం నిమజ్జనం సందర్భంగా గణనాథుడిని కారులో తరలించే సమయంలో సీటుబెల్టు ధరింపజేశారు. సురక్షిత ప్రయాణం కోసం కారులో సీటుబెల్టు ధరించడం అవసరమనే సందేశాన్ని ఈ విధంగా చాటారు. నిమజ్జనానికి గణనాథుడిని భద్రంగా తరలించిన తీరు స్థానికులను ఆకట్టుకుంది.

వినయ్ భాస్కర్‌ను పరామర్శించిన ఎర్రబెల్లి



అక్షరశక్తి, హనుమకొండ: మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌ను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం సాయంత్రం పరామర్శించారు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిని సందర్శించిన సందర్భంగా పోలీసుల దాడిలో వినయ్ భాస్కర్ గాయపడిన విషయం తెలుసుకున్న ఎర్రబెల్లి.. హనుమకొండలోని ఆయన నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఘటనకు దారితీసిన కారణాలను కూడా అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు.

గణపతి లడ్డూను దక్కించుకున్న మాధవి రవికుమార్ దంపతులు



అక్షరశక్తి, న్యూశాయంపేట: గ్రేటర్ పరిధిలోని 31వ డివిజన్ నందిహిల్స్ కాలనీలో శ్రీ వరసిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన గణపతి లడ్డూ వేలం పాటలో బిల్లా మాధవి రవికుమార్ దంపతులు రూ .1,00,116లకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ విషయాన్ని ఉత్సవ కమిటీ కన్వీనర్ తొగరు జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. అనంతరం మాధవి రవికుమార్ దంపతులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోకన్వీనర్ కాటం లక్ష్మారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ జి. జగన్మోహన్ రెడ్డి, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పెసరు నర్సింహారెడ్డి, దొంతి దేవేందర్ రెడ్డి, మధుపాల్ రావు, తక్కళ్లపల్లి దుర్గారావు, పసునూటి సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన గణపతి నిమజ్జన శోభాయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు పలికారు.



న్యూ శాయంపేట గణేష్ నవరాత్రుల సందర్భంగా గణనాథునికి ప్రత్యేక పూజలు

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.